కథ

# చలన చిత్రం

ఆంధ్ర దేశంలో అది ఒక సినిమా హాలు. ఆ హాలులో ఆంధ్రలో తిరుగులేని కథానాయకుడుగా పేరొందిన నటుడు నటించిన 'కట్టె పట్టిన వీరుడు' ఆడుతోంది. ఇదేమిటి 'కత్తి పట్టిన వీరుడు' కాకుండా ఈ 'కట్టె' ఏమిటని మీరు ఆశ్చర్యపోవద్దు. ఆ సినిమాలో హీరో చేతిలో ఒక పొడుగాటి 'కర్ర' కత్తి కంటె, ఇనుప రాడ్ కంటె బలంగా తయారవుతుంది. అదేం చిత్రమో దానితో కొన్ని వందల మందిని హతమారుస్తాడు. ఎదుటివాళ్లు కూడా అతన్ని చావ చితకకొడతారు. అయినా హీరోగార్కి క్రాఫ్ కూడా చెదరదు. దానితో లారీలు, చివరికి రైలింజను కూడా తుక్కు తుక్కు. పదరు సినిమా హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో నడుస్తోంది.

ఆ సినిమా చూడడానికి చైతన్య లైనులో నుంచున్నాడు. నిన్ననే వాళ్లక్కయ్యగారి ఊరు వచ్చిన చైతన్య తమ ఊళ్లో ఆ సినిమా తొందరగా రాదు కాబట్టి ఈ సినిమా తొందరగా చూసేయాలను కున్నాడు.

అకస్మాత్తుగా చైతన్య దృష్టి అటు మళ్లింది. పొడుగ్గా, ఎర్రగా, అందంగా వున్న ఒక అమ్మాయి క్యూ వైపు ఆందోళనగా చూస్తోంది. చైతన్య వెంటనే లైనులోంచి తప్పుకుని బయటపడి ఆ అమ్మాయి దగ్గరకు వెళ్లాడు.

"ఏమండీ టికెట్ కావాలా?"

"ఏం బ్లాకులో అమ్ముతున్నారా మీరు?"

"కాదు కావాలంటే మీకు టికెట్ సంపాది స్తాను" అన్నాడు ఇంగులిని.

"ఎందుకులెండి అనవసరంగా శ్రమ?" అంది ఆ అమ్మాయి తిప్పుకుంటూ.

"ఫర్వాలేదు డబ్బు ఇటు ఇవ్వండి" అంటూ చెయ్యి చాపాడు.

ఇంతలో

"ఏయ్ మిస్టర్ ఆ అమ్మాయితో నీకేం పని. పద పోలీస్ స్టేషన్‌కి" ఎక్కడ్నుంచి వచ్చాడో పోలీస్ వచ్చాడు.

"కాదండీ.. నేను ఈ అమ్మాయికి"—

"పదవోయ్ అమ్మాయిల్ని ఏడిపించేవాళ్లందరూ ఈ కాకమ్మ కథలే చెప్తారు" అంటూ చైతన్యను తీసుకువెళ్తూ ఆ అమ్మాయి వేపు తిరిగి

"ఇంకో నాలుగు కేసులు పట్టుకోమ్మా- ఈ రోజుకు చాలు. రేపు చూసుకుందాం. రేపటితో ఈ నెలకు పట్టుకోవలసిన కేసులు అయిపోతాయి" అంటున్నాడు.

చైతన్య ఇది విని "అది కాదండీ..."

"హూష్! మాట్లాడితే తగిలిస్తా, పద" అన్నాడు పోలీస్.

—కె.బి.కృష్ణ

# కాలం చెక్కిలిపై ఘనీభవించిన



సమయం రాత్రి పది గంటలు. రాధ తన గదిలో కూర్చుని చదువుకుంటున్నది. ఇంకో నెల రోజుల్లో ఆమె పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు వ్రాయబోతు న్నది. రాత్రులు ఎక్కువసేపు చదువుకోమని రాధ తల్లిదండ్రులు ఆమెను సతాయిస్తున్నా కూతురు ఫస్ట్ క్లాస్‌లో పాసవాలని వారి కోరిక. సమయం గడుస్తున్న కొద్దీ ఆమెకు పుస్తకం చదువుతుంటే విసుగెయ్యసాగింది.

సడన్‌గా ఆమెకు ఏదో గుర్తుకొచ్చింది. ఆమె మనసంతా క్షణాల్లో ఉత్సాహంతో నిండిపోయింది. హుషారుగా లేచి తన గదిలోంచి వరండాలోకొచ్చి అటుఇటూ చూసింది. తల్లిదండ్రుల గది వైపు చూసింది. గది తలుపులు మూసి వున్నాయి. ఫర్వాలేదు, నిద్రపోతున్నారు అనుకుంది. రాధ తన గదిలోకెళ్లి తలుపులు గెడ వేసుకుని టేబుల్ ముందున్న కుర్చీలో కూర్చుంది. తెల్లకాగితం, పెన్ను తీసుకుని ప్రేమలేఖ వ్రాయడానికి రెడీ అవసాగింది. ఆమె మనసులో ఆమె ఎదురింటి రాజు ప్రత్యక్షమై ఒక్క నిమిషంలో మాయ మయ్యాడు. ఆమె మనసంతా ఏదో తెలీని టెన్షన్, ఉద్వేగం. "తను తొలిసారిగా ప్రేమలేఖ వ్రాస్తు న్నది. అందుకేనేమో తనిలా ఫీలవుతుంది" అను కుందామె తనలో తాను. చిన్నగా వణికే చేతితో కాగితంమీద పెన్నుతో వ్రాయడం మొదలు పెట్టింది.

డియర్ రాజా!

బాగున్నావా! నాకెందుకో భయంగా వుంది. బహుశా ఇలా ఓ మగవాడికి ప్రేమలేఖ వ్రాయడం నాకు ఇదే మొదటిసారి అయినందుకేమో. రోజూ నువ్వు మీ మేడ మీద నుంచి నన్ను దొంగ చూపులు చూస్తూ మధురంగా నవ్వుతూ కళ్లతోనే నన్ను పలకరిస్తున్నావు కదూ. నువ్వలాంటి చిలిపి పనులు చేస్తూంటే నాకూ సరదాగానే వుంది. కానీ మా అమ్మ కంట్లో పడిపోతానేమోనని భయంగా వుంది. మా అమ్మకి ఇలాంటి విషయాలంటే ఒళ్లు మంట. ప్రేమా, గీమా అంటే ఆవిడకి తెలీవు.

డియర్ రాజా! నీ అందమైన నవ్వునాలిటే, నీ మాటల్లోని మాధుర్యం, భావుకత నన్నెంతో పరవ శింపచేస్తున్నాయి. నీతో గంటల కొద్దీ ఏకాంతంగా గడపాలని కోరుకుంటున్నాను. ఈ ప్రకృతిలోని ఆనందాన్నంతా మనమిద్దరమే ఆస్వాదించాలని కలలు కంటున్నాను. పరీక్షలు దగ్గర పడుతున్నా నా దృష్టి, మనసు పుస్తకాలమీద నిలవడం లేదు. అను క్షణం నా తలపుల్లో నువ్వే వుంటున్నావు. నావైపు నువ్వు నవ్వుతూ చూస్తూ, చేతులతో రమ్మని సైగలు చేస్తుంటే నేనాగలేకపోతున్నాను. పరుగు పరుగున వచ్చి


రాజా!

అందమైన నీ నవ్వునాలిటే, నీ మాటల్లోని మాధుర్యం, భావుకత నన్నెంతో పరవశింప చేస్తున్నాయి. నీతో ఏకాంతంగా గడపాలని కోరుకుంటున్నాను. నా మనసు పుస్తకాల మీద నిలవడం లేదు.

నీ ఒడిలో వాలిపోవాలనిపిస్తుంది. కానీ... ప్చ్.... కుదరడం లేదు. మా ఇంట్లో నాకంత స్వేచ్ఛ లేదు.

ఆ! రాజా డియర్- నిన్న సాయంత్రం మీ పక్కింటి అబ్బాయి చేత పంపించిన కబురు అందింది. జగదాంబ థియేటర్‌కు సినిమాకు రమ్మనమన్నావు. నేను రావాలని ఎంతో ప్రయత్నం చేశాను. కానీ వీలుపడలేదు. సారీ రాజా! ఇంకోసారి అతి త్వరలో నీ కోరిక తీరుస్తాను. నా పరీక్షలు అయ్యేవరకూ కొంచెం ఓపిక పట్టు. ప్లీజ్... ఆ తర్వాత నువ్వు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను. మా అమ్మకి ఏదో మస్కా కొట్టి వచ్చేస్తుంటాను. ప్రేమ సామ్రాజ్యంలో మనమిద్దరం అపూర్వ ప్రేమికుల్లా విహరిద్దాం. ప్రేమకి కొత్త అర్థాలు, భాష్యాలు చెబుదాం.

ఉత్తరం వ్రాస్తున్న రాధ చేతిలోని పెన్ సడన్‌గా ఆగిపోయింది. ఆమె కళ్లు బరువెక్కి పోతున్నట్టు



# కన్నీటి చుక్క ఆ ప్రేమలేఖ!

కనిపించసాగాయి. నిద్ర మత్తు ఆమెను క్రమంగా ఆవహించసాగింది. ఆలోచనలు ఆమెకు అందడంలేదు. ఎలాగైనా సరే ఆ ప్రేమలేఖ వ్రాయడం ఆ రాత్రి పూర్తి చెయ్యాలనుకుంది. కానీ ఆమె ప్రయత్నం ఫలించడంలేదు. ఇహ లాభం లేదు అనుకుని వ్రాసిన కాగితాలు ఓ పుస్తకం మధ్యలో పెట్టింది. తెల్లవారుఝామునే లేచి పూర్తి చెయ్యాలి అనుకుని నిద్రాదేవి ఒడిలోకి జారిపోయింది రాధ మగతగా.

* * *

మర్నాడు ఉదయం ఏడు గంటలయింది.

'రాధా! లేవవే... మొద్దు మొహమా లేవవే!' గట్టిగా అరుస్తూ తన వీపుమీద ఎవరో చేత్తో కొడుతుంటే బద్ధకంగా కళ్ళు తెరిచి ఒళ్ళు విరుచు కుంటూ ఎదురుగా వున్న తల్లివైపు చూసింది రాధ.

ఆమె ముఖంలో కోపం, చేతిలో తను రాత్రి వ్రాసిన ప్రేమలేఖ తాలూకు కాగితాలు.

రాధకు మత్తు వదిలిపోయింది. క్షణాల్లో ఆమె శరీరం సన్నగా కంపించసాగింది. మనసంతా భయంతో నిండిపోయింది.

"తను వ్రాసిన ప్రేమలేఖ తల్లికి దొరికిపోయింది. ఇవాళ నా పని అయిపోయింది" అనుకో సాగింది.

"ఏమే! ఎవడే ఈ రాజుగాడు. ఎన్నాళ్ల నుంచి సాగుతుంది ఈ వ్యవహారం. వేలెడంత లేవు 'ప్రేమ' కావాల్సివచ్చిందటే నీకు. చెప్పవే చెప్పు.... ఇలాంటి పాడు బుద్ధులు ఎప్పుడు నేర్చుకున్నావే. ఈ ఇంటి పరువు వీధిలో పడేస్తావుటే.... చెప్పవే.... నిజం చెప్పు ఎవడా కుర్రాడు... చెప్పవే' ఆవేశంతో, కోపంతో ఊగిపోతూ కూతురి శరీరం మీద ఇష్టం వచ్చినట్టు రెండు చేతులతో దెబ్బలు వెయ్యసాగింది రాధ తల్లి.

తల్లి కొడుతున్న దెబ్బల బాధకి తట్టుకోలేక పోతోంది రాధ. భోరున ఏడవసాగింది.

"అమ్మా! నన్ను కొట్టకే... నిజం చెబుతాను అది...అది.." ఏదో చెప్పాలని ఆమె పెదాలు కంపిస్తూ విచ్చుకోసాగాయి.

"నోర్ముయ్యవే.. దొంగముండా! ఏదో కథ చెప్పడానికి ప్రయత్నిస్తావు, నాకు తెలుసు. మళ్లీ ఇలాంటి పాడు ఉత్తరాలు వ్రాశావంటే నీవు పీరేస్తాను. ఒళ్లంతా వాతలు పెడతాను జాగ్రత్త!" కోపంగా అనేసి రుసరుసలాడుతూ వెళ్లిపోయింది రాధ తల్లి.

తల్లి వెళ్లాక జరిగినదాన్ని తలచుకుంటూ కుమిలి కుమిలి ఏడవసాగింది రాధ.

ఆ ప్రేమలేఖ ఎందుకు వ్రాసిందో తన ఒక్కర్తికే తెలుసు.

వారం రోజుల క్రితం ఓ వారపత్రికలో ఓ ప్రకటన చూసింది తను. 'ప్రేమలేఖల' పోటీకి అమ్మాయిలు, అబ్బాయిలు ప్రేమలేఖలు వ్రాసి పంపించండి. ప్రచురించినవాటికి మంచి నగదు బహుమతి ఇస్తాం అని వుంది. ఆ ప్రకటన చూసి తన సినిమా పరిజ్ఞానం, తన నవలా పరిజ్ఞానం ఉపయోగించి సరదాగా ప్రేమలేఖ వ్రాసింది ఆ పత్రికకు పంపించడానికి. తను సగం వ్రాసి వదిలేసిన 'ప్రేమలేఖ' ఇంత రాద్ధాంతం సృష్టించి తనను ఇంత బాధ పెడుతుందని ఊహించలేదు పాపం రాధ!

'ఈ విషయం తల్లికి చెప్పినా ఆమె నమ్మదు!' మూగగా రోదించసాగింది రాధ మనసు.

